# ఓ స్వప్న సంచారి యాత్రాకథనం: సిల్క్ రూట్‌లో సాహస యాత్ర

~ సోమశంకర్ కొల్లూరి



**పుస్తక సమీక్ష:** ఓ స్వప్న సంచారి యాత్రాకథనం: సిల్క్ రూట్‌లో సాహస యాత్ర

**రచన:** సోమశంకర్ కొల్లూరి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జనవరి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=788

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# ఓ స్వప్న సంచారి యాత్రాకథనం: సిల్క్ రూట్‌లో సాహస యాత్ర

The wish to travel seems to me characteristically human: the desire to move, to satisfy your curiosity or ease your fears, to change the circumstances of your life, to be a stranger, to make a friend, to experience an exotic landscape, to risk the unknown..”

— Mr. Paul Theroux,
*The Tao of Travel: Enlightenments from Lives on the Road*

పై వాక్యాలకి అద్దం పట్టిన పుస్తకం పరవస్తు లోకేశ్వర్ గారి “సిల్క్ రూట్‌లో సాహస యాత్ర”. తెలుగులో ఈ మధ్య కాలంలో వచ్చిన యాత్రాసాహిత్యంలో ఆసక్తికరమైన పుస్తకం.

మనలో చాలామందికి పర్యటనలంటే ఇష్టమే. ఎక్కువగా స్కూల్, కాలేజి స్థాయిలలో విజ్ఞాన, విహార యాత్రలతో సరిపోతుంది. మరికొందరు ఆధ్యాత్మిక ప్రదేశాలు తిరుగుతారు. ఇలాంటి వాళ్లు టూరిస్టులు కాని, ట్రావెలర్లు కాదు. టూరిస్టులకు పర్యాటక స్థలాల సందర్శనం ఆనందమిస్తే, ట్రావెలర్లకి ప్రయాణమే ఆనందాన్నిస్తుంది. పరాయి దేశాలలో, భాష కూడా తెలీని పరిస్థితులలో ఒక లక్ష్యం కోసం ప్రయాణించడం కష్టమే. అయితే లోకేశ్వర్ గారు అరవై రెండు సంవత్సరాల వయసులో, ఒంటరిగా, సరైన అన్నపానీయాలు కూడా లేకుండా, ఎన్నో కష్టాలకోర్చి ఒక ట్రావెలర్‌గా ప్రయాణంలోని ఆనందాన్ని ఆస్వాదించడమే కాకుండా, ఆ ఆనందాన్ని మనకూ పంచారు.

ఇలా తిరగడానికి రచయితని ప్రేరేపించిన చోదకశక్తి ఏది? “నా జీవితంలో నన్ను నడిపించే నావ నేను చదివిన సాహిత్యమే. అక్షరాలను ఆచరణలో అనువదించుకున్న ఫలితమే నా దేశదిమ్మరితనం. నా నిరంతర యాత్రలు. ఎంతకూ తీరని ఓ సుదీర్ఘ సంచార దాహం.” అని అంటారాయన. పూర్వజన్మలో తానొక ప్రయాణాల పక్షినేమోనని అనుకుంటారయన. సైబీరియా మంచు ఎడారుల నుండి బయలుదేరి, ఎండలు మండే ఇసుక ఎడారులను ధిక్కరించి, మానస సరోవరం దాటి హిమవన్నగములనధిగమించి మన దేశంలో, మన ఊరిలోని రాగిచెట్టుపై ప్రతిఏటా వాలే సిలికాన్ పక్షిని తనేనేమో అని అనుకుంటారు.

*పంచి బనూ*

*ఉడ్‌తే ఫిరూఁ*

*నీలిగగన్ మే..*

అని పాడుకుంటారు.

వీరు గతంలో బుద్ధుడి జన్మస్థలమైన నేపాలులోని 'లుంబినివనం' నుండి గౌతముడు మహాపరినిర్వాణం చెందిన'కుసినారా' దాకా రెండుసార్లు పర్యటించారు. మధ్యమధ్య మజిలీలుగా బుద్ధుడు నడయాడిన నేలలో, సంచరించిన అడుగుజాడలలో శ్రావస్తి, జేతవనం, కోశాంబి, వైశాలీ, నలందా, రాజగృహ, గృధ్రకూట పర్వతం, వేణూవనం, బోధగయ, సారనాథ్‌లలో సంచరించారు. అంతేకాదు, హైదరాబాద్ నుండి ఛత్తీస్‌గడ్‌కు స్కూటర్ యాత్ర చేసి అడవుల్ని, కొండల్ని చుట్టి, మందుపాతరలను దాటిన సాహసవంతుడాయన. మరి ఈయనకి పర్యటనలంటే ఎందుకింత మోజని పాఠకులకి సందేహం రావడంలో ఆశ్చర్యం లేదు. జవాబు ఆయన మాటల్లోనే విందాం.

"నా భ్రమణ కాంక్ష మూలాలు మా పూర్వీకుల రక్తం నుండి వారసత్వంగా వొచ్చినట్లుంది. రామానుజుడి భోధనల ఆధారంగా వైష్ణవ మతప్రచారం కోసం మా పూర్వీకులు తమిళదేశం నుండి బయలుదేరి దేశాటనం చేసారు. మా మాతామహుడు వొందేళ్లక్రిందట కాలినడకన హైద్రాబాదు పట్నం నుండి ఓఢ్రదేశంలోని పూరీజగన్నాధానికి వెళ్లిన వైనం గుర్తొచ్చింది". ఇంకా, "***పుస్తకాలు అందరూ చదువుతారు కాని అందులోని ప్రదేశాల అన్వేషణ కోసం, ఆ అక్షరాల అడుగుజాడలలో ఆ బాటలలో నడిచే అదృష్టం కొందరికే దక్కుతుంది. ఆ కొందరిలో నేనొక్కడిని*** " అని అంటారు.

మరి ఆయన ఈసారి "సిల్క్ రూట్" ఎంచుకోడానికి కారణం ఏమిటి? సిల్క్ రూట్ ప్రాముఖ్యత ఏమిటని కొందరికి సందేహం కలగవచ్చు. రెండున్నర వేల సంవత్సరాల క్రితం నుండి 13వ శతాబ్దంలో సముద్ర మార్గాల ఆవిష్కరణ వరకూ ఆసియా దేశాలకు, యూరపు దేశాలకు మధ్య 'వారధి'గా ఉపయోగపడిన మార్గమే 'సిల్కురోడ్డు'. అయితే ఈ మార్గం వాణిజ్య వ్యాపారాలకే పరిమితం కాక విజ్ఞాన శాస్త్రాలు, కళలు, మతాలు, సంస్కృతుల పరస్పర మార్పిడికి, ప్రభావాలకు కూడా ఉపయోగపడింది. ఆసియా ప్రాచీన నాగరికత ఈ 'బంగారు పట్టుదారుల' ద్వారానే యూరపు దేశాలలోకి ప్రవహించి విస్తరించింది.




'సిల్కు' ఆవిష్కరణ కన్నా ముందే చైనాలో మొదటిసారిగా రంగురాళ్లను కనుగొని దానిని ఒక పరిశ్రమగా అభివృద్ధి చేసి మధ్య ఆసియా దేశాలకు ఎగుమతి చేసి నగదు బదులు మధ్య ఆసియా నుండి బలమైన గుర్రాలను దిగుమతి చేసుకునే వారు. ఈ వ్యాపారం కోసమే చైనా నుండి మధ్య ఆసియా దేశాలకు 'మార్గం' ఏర్పడి తర్వాత కాలంలో రోమ్ దాకా విస్తరించి 'సిల్కురూట్'గా ప్రఖ్యాతిగాంచింది. యూరపు దేశాలనుండి వెండిబంగారాలు రత్నాలు వజ్రాలు దిగుమతి అవుతుంటే చైనా నుండి పట్టువస్త్రాలు, పింగాణీ సామానులు, మందుగుండు, పేపరు, చెక్కర లాంటివి ఎగుమతి అయ్యేవి. కవులు, కళాకారులు, దేశదిమ్మరులు, మత ప్రచారకులు, వృత్తిపని వారు ఈ మార్గాలలో రాకపోకలు సాగించేవారు. కేవలం వ్యాపార వాణిజ్య మార్గమే కాక వివిధ సంస్కృతుల పరస్పర మార్పిడికి ముఖ్యంగా బౌద్ధం, ఇస్లాం మతాల వ్యాప్తికి ఈ సిల్కురోడ్డు ఒక వారధిగా, వాహికగా పనిచేసింది.

ఆ వైభవోజ్వల చరిత్ర సందర్శనం కోసమే ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, చైనా దేశాలలో పర్యటించారు రచయిత. అలెగ్జాండర్, ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్, మార్కోపోలో, ఛంఘీజ్‌ఖాన్, బాబర్, ఛంఘీజ్ ఐత్ మాతోవ్, అనేకమంది బౌద్ధభిక్షువుల అడుగుజాడలలో గతించిన జ్ఞాపకాలను అన్వేషించడం కోసం ఈ మార్గంలో సంచరించారు.

ఒకప్పుడు ఈ మధ్య ఆసియా దేశాలన్నీ ప్రాచీన భరతఖండంలో అంతర్భాగంగానో, లేదా దగ్గరి సంభంధం కలిగున్న రాజ్యాలుగానో ఉండేవని చెబుతూ, ఆయా దేశాల పురాతన నామాలని తెలియజేసారు రచయిత.

ఈ మార్గంలోని దేశాలలోని పట్టణాలు, నగరాలు, గ్రామాల గురించి, వాటి చరిత్ర గురించి, పాలకుల గురించి, జాతుల గురించి, జాతి ఘర్షణల గురించి, పౌరుల మధ్య సంబంధాల గురించి చక్కగా వివరించారు రచయిత.

ఆయా దేశాల గతం గురించి చెబుతున్నప్పుడు ఓ చరిత్రకారుడిలా, వర్తమానం గురించి చెబుతున్నప్పుడు ఓ విశ్వపౌరుడిగా కనిపిస్తారు లోకేశ్వర్. అంతేకాదు ప్రాచీన రాజ్యాలలో దండయాత్రల గురించి చెబుతూ, ఒక చోట యుద్ధపిపాసిగా, దోపిడిదారుగా ముద్రపడిన వ్యక్తి, తన సొంత దేశంలో వీరుడిగా కీర్తించబడడాన్ని ప్రస్తావిస్తూ, "సంపూర్ణ సత్యం అంటూ ఏదీ ఉండదు. ప్రతీ సత్యం సాపేక్షకమే" అని అనడంలో ఆయనలో ఓ వేదాంతి కనబడతాడు.

ఆయా దేశాలలో చరిత్రలో జరిగిన కొన్ని ఘోరాలను వివరిస్తున్నప్పుడు, చదువరులు అయ్యో అనుకోకుండా ఉండలేరు. రచయితతో పాటు పాఠకుడు కూడా ఆ ఘోరాలకు బలైపోయిన వారికి మౌనంగా నివాళి అర్పిస్తారు.

ఈ దేశాలలోని క్రమశిక్షణా, మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రత, పెద్దలను, కవులను, రచయితలను గౌరవించే పద్ధతులను శ్రద్ధగా గమనించి, మన దేశంలో మనం వాటిని ఎందుకు అమలు చేసుకోలేకపోతున్నామో ఆత్మశోధన చేసుకోవాలని చెబుతారు.

లోకేశ్వర్ గారు మంచి చదువరి. ఆయన ఎన్నో పుస్తకాలు చదివారని, ఎందరో రచయితల పుస్తకాల సారాన్ని ఆస్వాదించారని పుస్తకంలోని ఉటంకింపుల వల్ల తెలుస్తుంది. చెంగిజ్ ఐత్ మాతోవ్, రాహుల్ సాంకృత్యాయన్, తెన్నేటి సూరి, చెరబండరాజు, రూసో, విక్రం సేత్, శ్రీశ్రీ, కాళోజి, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ్, రావిశాస్త్రి, సదాశివ, ఎడ్గార్‌స్నో, పెరల్ బక్, లీషావ్‌చీ, డాక్టర్ నార్మన్ బెతూన్, డాక్టర్ కోట్నీస్ వంటివారిని సందర్భోచితంగా ప్రస్తావించారు లోకేశ్వర్.

"చెంఘీజ్ ఐత్ మాతోవ్ రచనల ప్రభావం వల్ల నేను కిర్గిజ్‌స్థాన్‌ను ప్రేమించాను. ఆ దేశాన్ని సందర్శించి ఆ పాత్రల అడుగుజాడలను అన్వేషించాలని కలలు కన్నాను. ఆ దేశంలోని ప్రాచీన సిల్కు రహదారులలో ప్రయాణిస్తూ నా లోపలి సంచారదాహాన్ని సంతృప్తి పరచుకోవాలని

తహతహలాడాను. కన్న కలలు సాకారమవుతున్న క్షణాలలో ఆ తెల్లవారుజాము అమృత గడియలలో నేను 'తల్లి భూదేవి' ఒడిలోకి ప్రవేశించాను. 'జమీల్యా' ధనియార్‌ల ప్రేమ దేశంలోకి అడుగుపెట్టాను. ప్రకృతి ఒడిలో పసిపిల్లలకు పాఠాలు నేర్పిన 'తొలి ఉపాధ్యాయుడి' పాఠశాల అనబడే పాకలోకి వినమ్రంగా ప్రవేశించాను. ***మనం చదివిన పుస్తకాలలోని లక్షల అక్షరాలు మనల్ని మన ఇరుకిరుకు ఇళ్ళ నుండి ఇవతలకి లాగి సువిశాల ప్రపంచంలోకి నెట్టి దేశదేశాల రహదారుల మీద నడిపిస్తూ, సంచరించేటట్టు చేస్తాయని చెప్పటానికి ఒక పెద్ద ఉదాహరణ నా కిర్గిజ్‌స్థాన్ యాత్ర.***"

ఈ పుస్తకం చదువుతున్న పాఠకులు, మౌనంగా తలూపుతారు.

రచయితలో ఓ భావుకుడు దాగి ఉన్నాడు. "పాలు పంచదార లేని తేనీరునే నీరుగా భావించి సేవించి తరించి వణికించే ఆ రాత్రి చలి చెలితో కలిసి కాళ్లీడుస్తూ నడుస్తూ గదికి చేరుకుంటే అలసిసొలసిన శరీరానికి ఇక హాయిగా మత్తుగా మొద్దు నిద్ర ఎందుకు పట్టదు?" అని పాఠకులని ప్రశ్నించడంలోనూ, "రోడ్డుకు రెండువైపులా పచ్చని చెట్లమీద అల్లరల్లరిగా నవ్వుతున్న పువ్వులు. ఆ చెట్లక్రిందనే అరచేయంత పెద్దసైజు రోజాపూవులు పూజకు పనికిరాని పువ్వుల్లా వాడి వదలి రాలి నేలమీద దొర్లిపడి ఏడుస్తున్నాయి. అది ఇంకోరకమైన పుష్పవిలాపం." అని బాధపడడంలోనూ, రచయిత భావుకత్వం వ్యక్తం అవుతుంది. మరోచోట, ఓ విగ్రహాన్ని వర్ణిస్తూ, "పొడుగ్గా గడ్డం మీసాలు ఉండి ముడతలు దేరిన ముఖంలో పొద్దు వాలిన పడమటి సంధ్యారాగం ఒకవైపు, పసిముఖం కళ్లల్లో పెదాల్లో



తొలిజాము వెలుగురేఖలు మరోవైపు. ఒక జీవిత సత్యాన్ని బోధిస్తున్న దృశ్యం" అని పేర్కొన్నప్పుడు, పాఠకులు ఆ విగ్రహాన్ని చూడాలని కుతూహలపడడంలో ఆశ్చర్యం లేదు.

ఒకచోట తన చుట్టూ చోటు చేసుకుంటున్న సంఘటనల్ని ఓ అద్భుతమైన చిత్రంగా చిత్రించాలనుకుంటారు లోకేశ్వర్. కానీ తనకి చిత్రలేఖనం రాదని, ఆ సన్నివేశాన్ని అక్షరాలలో నిక్షిప్తం చేయలేకపోయానని అంటారు. కానీ ఆయన రాసిన ఆ వాక్యాలను చదివితే, ఆ దృశ్యం కళ్ళముందు కదలాడుతుంది. దాదాపు చిత్రలేఖనంతో సమానంగా ఉంటుందా వర్ణన.

కిర్గిజ్‌స్థాన్ లోని భారతీయ వైద్య విద్యార్థుల గురించి తెలుసుకోడం ఓ అనుభవం. వాసు లాంటి కష్టపడే విద్యార్థుల గురించి చదువుతుంటే ఆనందం కలిగితే, అజిత్, వికాస్‌ల గురించి తెలుసుకున్నాకా, మనసు భారమైపోతుంది. దేశం కాని దేశంలో, హైదరాబాద్ అనే పదం వినబడగానే ప్రాణంలేచొచ్చి, రచయితని ఆప్యాయంగా పలకరించిన ఇద్దరు తెలుగమ్మాయిలను కలుసుకున్నప్పుడు వారి ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయట. గుంటూరు నుంచి ఇక్కడికొచ్చి మెడిసిన్ చదువుతున్నారట.

రచయిత ఆయా సందర్శనా స్థలాలను ఎంత సుందరంగా వర్ణించారో, కొన్ని సంఘటనలను అంతే చమత్కారంగాను వివరించారు. ఆయన వాడిన వాక్యాలకు పాఠకుల పెదాలపై చిరునవ్వు మొలుస్తుంది.

ఈ రచనలో కొన్ని జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన అంశాలను కూడా సందర్భోచితంగా చెప్పారు. ఉదాహరణకు మౌల్వీ నసీరుద్దీన్ ప్రస్తావన వచ్చినప్పుడు యునెస్కో వారు ఆయన పేరిట 1996 సంవత్సరాన్ని "అంతర్జాతీయ ముల్లా నసీరుద్దీన్" సంవత్సరంగా ప్రకటించినట్లు గుర్తు చేయడం; మధ్య ఆసియాలోని దేశాలలో స్కూలు పిల్లల డ్రెస్సు అంతటా ఒకటేనని, పైన తెలుపు క్రింద నలుపని చెప్పడం ఇందుకు ఉదాహరణ.

ఉజ్బెకిస్థాన్‌లో 876 కి.మీ., కిర్గిజ్‌స్థాన్‌లో 4,736 కి.మీ., చైనాలో 9,000 కి.మీ., చొప్పున మొత్తం 14,612 కి.మీ. 55 రోజుల పాటు పర్యటించారు. రకరకాల కష్టాలకోర్చి, ఇలా తిరగడమెందుకు అనే ప్రశ్నకి జవాబుగా, "మనల్ని మనం తెలుసుకోవాలంటే, మన లోపలి నిగూఢ శక్తుల్ని బహిర్గతం చేసుకోవాలంటే, ఇటువంటి అరుదైన సాహసయాత్రలు చేయాలి. ఈ అనుభవాల సారంతో మనం మరింత పదును తేరుతాం. మనల్ని మనం మెరుగులు దిద్దుకుంటాం. ఈ యాత్రలు కూడా ఒక రకమైన ఆత్మావలోకనాలే. ప్రకృతి ఒడిలో ప్రయాణించడం అంటే మన అంతరంగిక ఆత్మలోకాలలోకి ప్రయాణించటమే!" అని అంటారు రచయిత.

ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మనకి కూడా అదే భావన కలుగుతుంది. రంగుల ఫోటోలతోనూ, సిల్క్ రూట్ మ్యాప్‌ల తోనూ ఉన్న ఈ 232 పేజీల పుస్తకం ఆసాంతం హాయిగా చదివిస్తుంది. రచయిత వెంట మనమూ సహయాత్రికులమై ప్రయాణిస్తాము.

రచయితకి ఈ యాత్ర చేయడానికి మూడున్నర లక్షల రూపాయలు ఖర్చయితే మనకు మాత్రం రూ. 250/-మాత్రమే అవుతుంది. “A book is the cheapest ticket you will ever hold.” అని Stefanos Livos చెప్పిన మాటలు అక్షర సత్యాలనిపిస్తాయి ఈ పుస్తకం చదివాక.

~ కొల్లూరి సోమ శంకర్

**ప్రాప్తి:**

ఈబుక్ & ప్రింటుబుక్: కినిగెలో లభ్యం




1. పి. లోకేశ్వర్, ఇం.నెం. 12-2-709/5/1/సి, నవోదయ కాలనీ, హైదరాబాదు – 28, సెల్: 9160680847, 9392 6988 14

2. నవోదయ బుక్‌షాప్, కాచిగూడ, హైదరాబాద్.
ఫోన్: 040 2465 2387

3. విశాలాంధ్రా బుక్ హౌస్, అన్ని బ్రాంచీలలోను.

— మీ స్పందన తెలియజేయండి —

For Latest Telugu Books - Visit now:
Kinige
.com